# వైద్య రాజధానిగా అమరావతి

- రాజధానికి 13 హెల్త్ వర్సిటీలు
- ఎయిమ్స్‌కు శంకుస్థాపన చేసిన సీఎం
- 600 కోట్లతో 1200 పడకల ఆస్పత్రి

అమరావతి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి వైద్య రాజధాని కావాలి. విదేశీయులూ మెరుగైన వైద్యం కోసం ఇక్కడకు రావాలి' అని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతి అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఏఏఐఎంఎస్-ఎయిమ్స్)కు గురువారం సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'భవిష్యత్తులో గుండె ఆపరేషన్లకు అమెరికా నుంచి అమరావతి రావాలి.' అని ఆకాంక్షించారు. రాజధాని ప్రాంతం వైద్యానికి ప్రసిద్ధి చెందాలని సంకల్పించామని, దానికి అనుగుణంగా 10 అత్యుత్తమ యూనివర్సిటీల్లో నాలుగు ఏపీకి వచ్చాయని అన్నారు. 13 వైద్య విశ్వవిద్యాలయాలు, అత్యంత అధునాతన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఇక్కడ ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అమెరికాలో వైద్య ఖర్చు ఎక్కువని, అదే అమరావతిలో ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. రాజధాని అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ ఐదు నగరాల్లో ఒకటిగా, నిత్యం చైతన్యంతో తొణికిసలాడాలని ఆకాంక్షించారు. దేశంలోనే తొలిసారిగా పేదలు, ధనికులు అందరికీ వైద్య బీమా కల్పించిన తొలి రాష్ట్రం ఏపీయేనన్నారు. అదేసమయంలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఇచ్చే మొత్తాన్ని రూ.2.5 లక్షలకు పెంచామని, వ్యాధుల కవరేజిని పెంచామని పేర్కొన్నారు. ఒకప్పుడు ఒకరు లేక ఇద్దరు బిడ్డలు చాలని తానే ప్రచారం చేశానని, అయితే ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని చెబుతున్నానని సీఎం వ్యాఖ్యానించారు. ఒకప్పుడు సెల్‌ఫోన్ కొనాలని తానే ప్రచారం చేశానని, అయితే దాన్ని అవసరమైన మేరకే వాడాలని ఇప్పుడు చెబుతున్నానని అన్నారు. ఫిజికల్ రోగాలకంటే మానసిక రోగాలు ఎక్కువయ్యాయన్నారు.



ఎయిమ్స్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం

అందుకే ఆదివారాలు పనిచేయవద్దని, సరదాగా రోడ్డుమీదకు వచ్చి ఆటాపాటలతో గడపాలని పిలుపునిచ్చారు. పట్టిసీమను పలువురు వ్యతిరేకించారని, ఈ రోజు అది లేకుంటే కృష్ణా డెల్టా లేదన్నారు. ఒకప్పుడు సాగునీరు ఉండడం వల్ల కృష్ణా డెల్టా విజ్ఞాన భూమిగా ఉండేదని, ఇక్కడి నుంచే విజ్ఞానం హైదరాబాద్‌కు... అక్కడి నుంచి అమెరికాకు వెళ్లిందన్నారు. ఇప్పుడు అమెరికా నుంచి వచ్చి ఎయిమ్స్ ఆస్పత్రి పెడుతున్నారని, మరింత మంది ఎన్ఆర్ఐలు జన్మభూమి అభివృద్ధి కోసం ముందుకురావాలన్నారు. ఆస్పత్రికి భూమి ఇచ్చిన దాత పద్మనాభరావును సీఎం అభినందించారు. మంత్రులు కామినేని శ్రీనివాస్, దేవినేని ఉమ, భూమా అఖిలప్రియ కూడా మాట్లాడారు. ఎయిమ్స్‌కు అవసరమైన భూమి, ఇతర అనుమతులన్నీ ఒక్క రూపాయి తీసుకోకుండా ఏపీ ప్రభుత్వం ఇచ్చిందని నవనీత కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో అమెరికాలో ఉన్న తాము చాలా బాధపడ్డామని, జన్మభూమికి ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభించాలని భావించి మంత్రి దేవినేని ఉమకు చెబితే, ఏం కావాలంటే అది ఇప్పిస్తాం రండి అన్నారన్నారు. ఇబ్రహీంపట్నం సర్పంచిగా 40 ఏళ్లు పనిచేసిన పద్మనాభరావు తన భూమిలోనే ఆస్పత్రి పెట్టాలని సంతోషంగా భూమి ఇచ్చారని తెలిపారు.